క్లుప్తంగా

సీనియర్ పాత్రికేయుడు మృతి



నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ నితిన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జయప్ప

రామకుప్పం: మండలంలోని బగళనత్తం గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు సోమరామిరెడ్డి అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతి చెందారు. జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జయప్ప, స్థానిక సర్పంచ్ రాజ్‌గోపాల్, ప్రచార కార్యదర్శి కేశవ రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్సీ భరత్ ఆదేశాలతో అంత్యక్రియలకు రూ.10 వేలు అందజేశారు. ఆయన మృతికి ఎమ్మెల్సీతోపాటు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, కుప్పం, రామకుప్పం ప్రెస్ క్లబ్ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ రమణకు ప్రశంసా పత్రం



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న రమణ

గంగవరం: స్థానిక సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రమణ ఉత్తమ ఉద్యోగిగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ నుంచి చిత్తూరులో నిర్వహించిన స్వాతంత్య్ర దిన సంబరాల్లో ప్రశంసా పత్రం అందుకున్నారు. బుధవారం ఆయన్ను ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, సచివాలయ ఉద్యోగులు అభినందించారు.

జారి పడి వృద్ధురాలి మృతి

చిత్తూరు రూరల్: నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు బుధవారం బాత్‌రూంలో జారిపడి మృతి చెందింది. గుడిపాల మండలం పిళ్లారికుప్పం గ్రామానికి చెందిన కన్నమ్మ (75) కాళ్ల నొప్పులతో సోమవారం ఆస్పత్రిలో చేరింది. ఆర్థో వార్డులో చికిత్స పొందుతున్న ఆమె బుధవారం ఉదయం కాలకృత్యాల కోసం బాత్‌రూంలోకి వెళ్లింది. ఈ క్రమంలో కిందపడి సంఘటన స్థలంలోనే మృతి చెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

వరసిద్ధునికి రూ.లక్ష విరాళం



ఆలయ అధికారులకు విరాళం ఇస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని చంద్రగిరికి చెందిన ధనుష్ కుమార్ రెడ్డి ఆన్‌లైన్ ద్వారా అందించారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన యూసీమాస్ అబాకస్ సంస్థ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారని యూసీమాస్ సంస్థ నిర్వాహకురాలు భార్గవి తెలిపారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15న గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో చిత్తూరు నుంచి 90 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఇందులో నలుగురు చాంపియన్‌షిప్ సాధించగా, 15 మంది రన్నరప్‌గా నిలిచారన్నారు. ప్రతిభ చాటి న విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్, నగదు బహుమతి అందించారని ఆమె వెల్లడించారు.

రేపటి నుంచి ధ్యాన మహా యజ్ఞం

తవణంపల్లె: మండలంలోని సిద్దంపల్లె సమీపంలో ఉన్న శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహా శక్తి క్షేత్రంలో ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు సామూహిక సంకల్ప ధ్యాన మహా యజ్ఞం నిర్వహించనున్నట్లు గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ బి.గోపాలకృష్ణ మూర్తి, కన్వీనర్ రాధిక తెలిపారు. ప్రతి రోజూ సామూహిక సంగీత ధ్యానం, సామూహిక మౌన ధ్యానం, ఆత్మజ్ఞాన సందేశాలు, స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం, ధ్యాన ప్రచారం, సేవా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

గత హామీలు గాలికి.. | ఇప్పటి హామీలు దేనికి?

- 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీల విస్మరణ
- డీకేటీ భూములను సెటిల్‌మెంట్ చేస్తామని పట్టించుకోలేదు
- డూప్లికేట్ ఏటీఎం కార్డులు ఇచ్చి ప్రజలను బురిడీ కొట్టించే యత్నం
- 2019 ఎన్నికల్లో మొత్తం 600 హామీలిచ్చి, గాలికొదిలేసిన వైనం
- మళ్లీ వచ్చే ఎన్నికల్లో మభ్య పెట్టేందుకు.. మీ భవిష్యత్తుకు గ్యారెంటీనట!
- ఇచ్చిన హామీలనే కాదు.. ఇవ్వని హామీలను నెరవేర్చిన వైఎస్సార్‌సీపీ
- నీ హామీలను నమ్మం బాబూ.. అంటున్న పలమనేరు వాసులు





డీకేటీలకు హక్కు కల్పిస్తామంటూ 2014లో పలమనేరులో టీడీపీ పంపిణీ చేసిన కరపత్రాలు (ఫైల్)

పలమనేరు: ఐదేళ్లకోసారి ఎన్నికలకు ముందు ఆచరణకు సాధ్యం హామీలను గుప్పించడం ఆపై వాటిని గాలికొదిలేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఆయన 'పసుపు కుంకుమ' ఇచ్చినా, వందలాది హామీలు గుప్పించినా బాబు మాటను నమ్మని జనం 2019లో 23 స్థానాలకే పరిమితం చేసి టీడీపీని చిత్తు చేశారు. మళ్లీ 2024 ఎన్నికల కోసం రంగంలో దిగిన చంద్రబాబు 'భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరిట కొత్త హామీలను గుప్పిస్తున్నారు. ఇలాంటి ఎన్నికల హామీలెన్నిచ్చినా తాము బాబు మాటను నమ్మేది లేదని తేల్చి చెబుతున్నారు పలమనేరు నియోజకవర్గ ఓటర్లు. ఇదే సమయంలో రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను 98శాతం నెరవేర్చి జనంలో విశ్వసనీయత, నమ్మకాన్ని పెంచుకుంది.

అప్పట్లో మైనారిటీలకు దగా చేశారు

నియోజకవర్గంలో 26వేలమంది దాకా మైనారిటీ ఓటర్లున్నారు. వారికి రూ.5లక్షల దాకా వడ్డీ లేని రుణాలిస్తామని ఆ ఎన్నికల్లో హామీ ఇచ్చి విస్మరించారు. డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ అంటూ దగా చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా ఇళ్లు ఇస్తామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో మంజూరైన 632 ఇళ్లు ఇంతవరకు పునాదులకు నోచుకోలేదు. మళ్లీ 2019 ఎన్నికల వేళ మహిళలకు 'పసుపు–కుంకుమ' పేరిట మోసం చేశారు.

2019లోనూ మళ్లీ ఉత్తుత్తి హామీలే!

2014లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా మళ్లీ 2019లో 600 దాకా హామీలిచ్చారు. ఆరువేల హామీలిచ్చినా నిన్ను నమ్మం బాబు అంటూ జనం భారీ మెజారిటీతో వైఎస్సార్‌సీపీని ఆదరించారు. 2019 ఎన్నికల్లో మాజీ మంత్రి అమరాథరెడ్డి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. వైఎస్సార్‌సీపీ నుంచి రాజకీయ అనుభవం లేని సామాన్య యువకుడు వెంకటేగౌడ.. మాజీ మంత్రిపై 33వేల ఓట్ల మెజారిటీతో భారీ విజయాన్ని అందుకున్నారు. దీన్ని బట్టి చూస్తే ఓటర్లు చంద్రబాబు హామీలను నమ్మనట్టే.

2024కోసం భవిష్యత్తుకు గ్యారెంటీ పేరిట కొత్త డ్రామా

వందలాది హామీలిచ్చినా జనం నమ్మకపోవడం, ఇదే సమయంలో వైఎస్సార్‌సీపీ నవరత్నాలను విజయవంతంగా అమలు చేసింది. దీనిని మక్కికి మక్కీ కాపీ కొట్టి ఇప్పుడు కేవలం ఆరు పథకాలతో 'మీ భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరిట ఎన్నికల్లో ఓటర్లకు గాలం వేసేందుకు పూనుకున్నారు. మేనెల 28న చంద్రబాబు మహాశక్తి, యువగళం, అన్నదాత, పూర్ టు రిచ్, ఇంటింటికీ మంచినీరు, బీసీల రక్షణ చట్టం పేరిట హామీలను గుప్పించారు.

డీకేటీలపై రైతులకు హక్కు కల్పించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

తాజాగా ఇప్పటి ప్రభుత్వం డీకేటీ పట్టాలున్న వారికి సెటిల్‌మెంట్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఫలితంగా పలమనేరు నియోజకవర్గంలో దాదాపు 65వేల ఎకరాల్లో డీకేటీ భూములుండగా 38వేలమంది రైతులున్నారు. వీరిలో ప్రభుత్వ నిబంధనల మేరకు 20వేలమందికి మేలు కలగనుంది. ఈ నాలుగేళ్లలో పలమనేరు నియోజకవర్గంలో ఈ ప్రభుత్వం 40వేల మందికి పక్కాఇళ్లను మంజూరు చేసింది. కేవలం పట్టణంలోనే 4వేల ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. గ్రామాల్లో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పరిపాలనను గ్రామాల్లోకి ప్రజలకు చేరువచేసింది. గత ఎన్నికలపుడు ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను సైతం అమలు చేస్తూ 98శాతం మందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చొరవచూపింది. ఫలితంగా జగనన్న మాటిస్తే మాటమీద కట్టుబడి ఉంటారని, అదే చంద్రబాబు ఎప్పుడు ఓటర్లను ఏమార్చేందుకు మాత్రమేనంటూ నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు.

2014 ఎన్నికల్లో ఇలా ఏమార్చారు

పలమనేరు నియోజకవర్గానికి సంబంధించి 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన హామీల్లో వేటినీ నెరవేర్చలేదు. అప్పటి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్‌సీపీ నుంచి అమరనాథ రెడ్డి(ప్రస్తుతం టీడీపీ) తలపడ్డారు. వైఎస్సార్ సీపీలో అమరనాథరెడ్డి గెలిచారు. ఆపై పార్టీ ఫిరాయించి, టీడీపీ గూటికేవెళ్లి, ప్రతిఫలంగా మంత్రి పదవి పొందారు. ఆ ఎన్నికలప్పుడు ఈ నియోజకవర్గంలో టీడీపీ నాయకులు ఎన్నికల కరపత్రాల సాక్షిగా జనానికిచ్చిన హామీలను గాలికొదిలేశారు. ఈ ప్రాంతంలో డీకేటీ భూములు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఇక్కడి రైతులను ఏమార్చేందుకు డీకేటీ భూములను సెటిల్‌మెంట్ పట్టాలుగా మార్చుతామంటూ కరపత్రాలను ముద్రించి ఇంటింటా పంచిపెట్టారు. కానీ అధికారంలోకి వచ్చాక దీని గురించి అస్సలు పట్టించుకోలేదు. వ్యవసాయాన్ని ఉపాధి హామీకి అనుసంధానం చేస్తామని ఊదరగొట్టారు. ఆ తర్వాత దీనిపై ప్రశ్నిస్తే అది కేంద్రానికి సంబంధించిన అంశమని, తమ చేతుల్లో లేదని చేతులు దులుపుకున్నారు. అలాగే రైతులకు అన్ని రకాల రుణాలు పూర్తిగా మాఫీ అని ప్రకటించి, రుణమాఫీ కార్డులను, ఇచ్చి ఏమార్చారు. నియోజకవర్గంలో 13 వేలమంది అర్హులైన రైతులకు రుణమాఫీ చేసిన పాపానపోలేదు. మహిళలకు నగదు బదిలీ కార్డులంటూ ప్లాస్టిక్ కార్డులను పంపిణీ చేసి జడలో పూలు పెట్టారు.



టీడీపీ నాయకులు మహిళలకు పంపిణీ చేసిన నగదు బదిలీ ఏటీఎం కార్డులు (ఫైల్)

డీకేటీలను సెటిల్‌మెంట్లు చేస్తామని కరపత్రాలు పంచారు



2014 ఎన్నికల్లో డీకేటీ భూములను సెటిల్‌మెంట్ పట్టాలుగా మార్చుతామంటూ టీడీపీ హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చాక దాన్ని పట్టించుకోలేదు. ఇప్పటి ప్రభుత్వం చంద్రబాబు చేయలేని పనిని చేతల్లో చూపింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎన్నో కార్యక్రమాలను చేస్తున్నా అన్నింటికంటే రైతులకు చాలా ముఖ్యమైంది మాత్రమే డీకేటీలను సెటిల్‌మెంట్‌గా చేయడమే. దీంతో రైతులకు చాలా మేలు కలుగనుంది.

–గాలి సుబ్రమణ్యం నాయుడు, రైతు, రంగినాయనిపల్లి

ఇంటికి కిలో బంగారం ఇస్తామన్నా నమ్మరు



గత ఎన్నికలపుడు టీడీపీ ఇచ్చిన హామీలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. వాటిలో అమలైన హామీలేమైనా ఉంటే వారే చెప్పాలి. హామీలిస్తూ జనాన్ని మభ్యపెడుతున్నారని గత ఎన్నికల్లో టీడీపీని ప్రజలు చిత్తుగా ఓడించారు. ఇప్పుడు మళ్లీ భవిష్యత్తుకు గ్యారెంటీ పేరిట హామీలనిచ్చారు. అయితే చంద్రబాబు హామీలను ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. ఆయన ఇంటింటికీ కిలో బంగారం ఇస్తామన్నా ఎవరూ నమ్మరు.

–గేటు బాబు, వ్యాపారి, పలమనేరు

ఉత్తమ అధికారులకు సన్మానం





ఉత్తమ అధికారులను సన్మానిస్తున్న దళిత నాయకులు, పలమనేరులో..

పుంగనూరు: ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుకు తహసీల్దార్ సీతారామన్, ఏఈ హేమంత్‌కుమార్ స్వాతంత్య్ర దినోత్సవం రోజున జిల్లా అధికారుల నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. బుధవారం వారిని దళిత నాయకులు సన్మానించి, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దళిత నేతలు రాజు, పెంచుపల్లి కృష్ణప్ప, బాలాజి, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

గంటావూరు వెల్ఫేర్ సెక్రటరీకి..

పలమనేరు: జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్వాతంత్య్ర దిన వేడుకల్లో పలమనేరు మున్సిపాలిటీ గంటావూరు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ శివకుమార్ జిల్లా అధికారుల నుంచి ప్రశంసాపత్రం అందుకున్న నేపథ్యంలో బుధవారం ఆయనను వైఎస్సార్ సీపీ నాయకులు సన్మానించారు. సచివాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోనే టాప్ టెన్ సచివాలయాల జాబితాలో పేరున్న గంటావూరు సచివాలయంలో ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో శివకుమార్ పాత్ర ఎంతో ఉందని పట్టణ కన్వీనర్ జాఫర్ పేర్కొన్నారు. సచివాలయాల కన్వీనర్ కోదండరామయ్య, సచివాలయ అడ్మిన్ జలంధర్, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుడి అరెస్ట్ చూపుతున్న సెబ్ అధికారులు

పలమనేరు: పలమనేరు సెబ్ పరిధిలోని కీలపట్ల క్రాస్ వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న గంగవరం మండలం కీలపట్ల మాదిగపల్లెకు చెందిన భద్రయ్య(68)ను అరెస్ట్ చేసి అతని నుంచి 160 టెట్రా ప్యాకెట్లను సీజ్ చేసినట్టు డీటీఎఫ్ ఎస్‌ఐ మాధవస్వామి బుధవారం తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని తిప్పిదొడ్డి నుంచి నిందితుడు అక్రమంగా మద్యాన్ని తెచ్చి స్థానికంగా అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు తేలిందని చెప్పారు. దాడుల్లో ఎస్‌ఐ మస్తాన్‌వలి, సిబ్బంది శ్రీనాథరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలు జారి పడి వృద్ధురాలి మృతి

చిత్తూరు రూరల్: వృద్ధురాలు మరుగుదొడ్డిలో కాలుజారి పడి మృతి చెందిన సంఘటన బుధవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. వైద్య సిబ్బంది కథనం మేరకు, గుడిపాల మండలం పిళ్లారికుప్పం గ్రామానికి చెందిన కన్నమ్మ (75) కాళ్ల నొప్పులతో సోమవారం ఆస్పత్రిలో చేరింది. ఆస్పత్రిలో ఆర్థో వార్డులో చికిత్స పొందుతున్న ఆమె బుధవారం ఉదయం కాలకృత్యాల కోసం మరుగుదొడ్డిలోకి వెళ్లింది. ఈ క్రమంలో అక్కడే కిందపడి సంఘటన స్థలంలోనే మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

వి.కోట: విద్యార్థుల్లో నిబిడీకృతమైన సృజనాత్మకతను వెలికితీయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా సైన్స్‌అధికారి ఆర్వీ రమణ అన్నారు. బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్లపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించి, వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ పర్యవేక్షిస్తుందన్నారు. ప్రతి ఉన్నత పాఠశాల నుంచి 5 నామినేషన్లు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 నామినేషన్లు ఈ నెలాఖరులోపు ఇనెస్పైర్ మనక్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, ఎన్‌జీసీ జిల్లా కో–ఆర్డినేటర్, బాల చైతన్య ఆర్‌పీలు మోహన్‌రావ్, మోహన్ సింగ్, పలు పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి

సంక్షేమ ఫలాలతో ఆర్థిక స్వావలంబన

పుంగనూరు: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు అమలు చేస్తూ, మహిళలకు భరోసా కల్పిస్తున్నారని ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం అంబేడ్కర్ భవన్‌లో మండల మహిళా సమాఖ్యల సర్వ సభ్య సమావేశం ఏపీఎం రవి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ మాట్లాడారు. నియోజకవర్గంలో అర్హులైన మహిళలందరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం మహిళలకు సున్నావడ్డీ రుణాలు, ఆసరా, చేయూతను అందించి, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోందని, అలాగే బ్యాంకులు విరివిగా మహిళలకు రుణాలు మంజూరు చేసి, ఆర్థిక స్వావలంబనకు బాటలు వేయాలని కోరారు. సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని, జగనన్న చిరకాలం ముఖ్యమంత్రిగా ఉండేలా ఆశీస్సులివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నారాయణ, బ్యాంకు మేనేజర్లు నాగేంద్ర, నరసింహులు, వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డి, సీడీపీఓ రాజేశ్వరి, డెయిరీ ఏపీఎం కదిరప్ప, సీసీలు, సంఘమిత్రలు, గ్రామ సమాఖ్య లీడర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి

మెరుగైన వైద్యసేవలే ముఖ్యం



వైద్యులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- సీహెచ్‌సీ తనిఖీలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: వైద్యాధికారులు రోగులకు 24 గంటలు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం పట్టణంలోని సీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగం, అత్యవసర విభాగం, గర్భవతుల విభాగాన్ని ఆయన పరిశీలించారు. మౌలిక సదుపాలయాలపై ఆరా తీశారు. 30 పడకలతో ఉన్న సామాజిక వైద్య కేంద్రాన్ని 100 పడకల సామర్థ్యానికి పెంచితే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ ఆయనకు నివేదించారు. అలాగే ఐదేళ్లుగా ఆస్పత్రిలో తాగునీరు, విద్యుత్ సమస్యలున్నాయని చెప్పారు. ఆస్పత్రిలో బోరు వేయించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జెడ్పీ చైర్మన్ వెంటనే సంబంధిత అధికారులతో చర్చించారు. జెడ్పీ నిధులతో బోరు, మోటార్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు కేశవులు, ప్రవీణ్‌కుమార్, కిజియారాణి, మురళి, సల్మా, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

–గంటల వ్యవధిలో ఛేదించిన పోలీసులు

రొంపిచెర్ల: యువతి అదృశ్యం కేసును దిశ పోలీసులు గంటల వ్యవధిలో ఛేదించారు. ఈ ఘటన రొంపిచెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు...రొంపిచెర్లకు చెందిన చంద్రశేఖర్ తన కుమార్తె కనిపించడం లేదని మంగళవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో దిశకు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న దిశ పోలీసులు గంటల వ్యవధిలో యువతి ఇంటికి చేరుకున్నారు. అదృశ్యమైన యువతి వివరాలను సేకరించిన పోలీసులు విచారణను ప్రారంభించారు. యువతి బంధువులు, స్నేహితులను ఇంట్లో గాలించిన పోలీసులు...బాలాజీ అనే యువకుడితో వెళ్లినట్లు గుర్తించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారు తిరుపతిలో ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. అక్కడికి పోలీసులు చేరుకునే సరికి బాలాజీ, యువతి వివాహం చేసుకున్నారు. తర్వాత ఇద్దరినీ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. గంటల వ్యవధిలోనే తమ కూతురుని గుర్తించడంతో పాటు క్షేమంగా అప్పగించిన పోలీసులకు యువతి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఇదలా ఉంచితే, యువతి తిరుపతిలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతోందని, బాలాజీ గ్రూప్ డ్యాన్సర్‌గా పనిచేస్తున్నట్లు తెలియవచ్చింది.

ఉపాధ్యాయునికి వీడ్కోలు సన్మానం



వీడ్కోలు సన్మానంలో టీచర్లు, గ్రామస్తులు, విద్యార్థులు

సదుం: మండలంలోని బలిజపల్లె పాఠశాల నుంచి సోమల మండలం సూరయ్యగారిపల్లె పాఠశాలకు టీచర్ జయప్రకాష్ బదిలీ అయ్యారు. ఈనేపథ్యంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు బుధవారం సన్మాన, వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన సేవలను ప్రస్తుతించారు. ఎంఈఓలు శ్రీరాములు, దామోదర, ఎస్టీయూ నాయకుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

సోమల: మామిడి రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ రెడ్డి రాము తెలిపారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ, కాయలు కోసిన 15 నుంచి 20 రోజుల తరువాత అడ్డ దిడ్డంగా పెరిగిన కొమ్మలను పూర్తిగా కత్తిరించాలన్నారు. కత్తిరించిన కొమ్మ భాగానికి సీటీసీని ఒక లీటర్ నీటిలో కలిపి ఆ ద్రావణాన్ని పూయాలని, పూత నిలిచేందుకు ఆర్కా మాంగో స్పెషల్ అనే ఐఐహెచ్‌ఆర్ (బెంగళూరు) కొత్తగా కనుకొన్న పోషకాన్ని ఒక లీటర్ నీటిలో 8 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, హెచ్‌ఓ సంతోషి కుమారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్ రెడ్డి

27న చలో విజయవాడ





బైరెడ్డిపల్లెలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, పలమనేరులో..

బైరెడ్డిపల్లె: ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తమ సమస్యల సాధన కోసం ఈనెల 27న నిర్వహించ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం కరపత్రాలు ఆవిష్కరించారు. అంగన్‌వాడీ వర్కర్లు మాట్లాడుతూ, నాణ్యమైన సరుకులు, కొలతలు, బియ్యం బస్తాల్లో తక్కువ తూకాలు ఉంటున్నాయని, తమ సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శకుంతల, తిప్పక్క, సరోజ, స్వాతి, ముని వెంకటమ్మ, ఉష, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: విజయవాడలోని మొగలరాజపురం సిద్దార్థ ఆడిటోరియంలో ఈనెల 27న నిర్వహించనున్న అంగన్‌వాడీల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఆర్ జ్యోతి పిలుపునిచ్చారు. స్థానిక సంఘ కార్యాలయంలో సదస్సు పోస్టర్లను బుధవారం ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. జిల్లానుంచి పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రనాథ్, సభ్యులు మంగళగౌరి, నీరజ, ఇందుమతి, కవిత, కనకనీలమ్మ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అంకాళపరమేశ్వరి ఊరేగింపు

చిత్తూరు రూరల్: అమావాస్యను పురస్కరించుకుని నగరంలోని గుర్రప్పనాయుడు వీధిలో ఉన్న శ్రీ అంకాళపరమేశ్వరి ఊరేగింపు బుధవారం నేత్రపర్వంగా సాగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మూల స్థానంలోని అమ్మవారికి అభిషేక పూజలు చేయించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అమ్మవారికి ప్రీతికరమైన పదార్థాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారిని నగర వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.



నగర వీధుల్లో ఊరేగుతున్న అంకాళపరమేశ్వరి

వాలీబాల్ విజేత కొత్తపల్లె–ఏ జట్టు

గుడిపాల: మండలంలోని పాపిశెట్టిపల్లెలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతగా కొత్తపల్లె జట్టు నిలిచింది. పాపిశెట్టిపల్లె యువత ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో 16 జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కొత్తపల్లె–బి జట్టుపై కొత్తపల్లె–ఏ జట్టు విజేతగా నిలిచింది. మొదటి రెండు బహుమతులను కొత్తపల్లె జట్లు గెలుచుకున్నాయి. మూడవ బహుమతి పేయనపల్లె జట్టుకు దక్కింది.



విజేతగా నిలిచిన కొత్తపల్లె–ఏ జట్టు